క్లుప్తంగా

ఘనంగా దేవస్థాన సంప్రోక్షణ మహోత్సవం

లింగాల : కోమన్నూతల గ్రామంలో వెలసిన శ్రీపాలేటి గంగమ్మ దేవస్థాన జీర్ణోద్ధరణ, పునఃనిర్మాణం జరిగిన సందర్భంగా శనివారం సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు గ్రామంలోని అన్ని దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాలేటి గంగమ్మ ఆలయంలో గణపతి పూజ, స్వస్తి వాచన, పంచగవ్య, శ్రీపాలేటి గంగమ్మ సంప్రోక్షణ అభిషేకం, దేవాలయ శిఖర కలశ స్థాపన నిర్వహించారు. అదేవిధంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రారంభమైన జ్యోతుల ఉత్సవం



బిందె సేవ కార్యక్రమంలో కళాకారులు

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురంలో శనివారం సాయంత్రం జ్యోతుల ఉత్సవం ప్రారంభమైంది. ముందుగా పురం మాను వద్ద ప్రత్యేక పూజలు అనంతరం కళాకారులు నృత్యం చేస్తూ బిందె సేవ నిర్వహించారు. బైపాస్ రోడ్డులోని చౌడమ్మ ఆలయం వద్దకు బ్యాండు మేళాల మధ్య బిందె సేవ కొనసాగించారు. మళ్ళీ ఆలయం వద్ద నుంచి పురం మాను వక్కపొద్దు కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం వేకువజామున జమ్మలమడుగు కళాకారులచే జ్యోతుల కడవ బోనం భక్తి శ్రద్ధలతో కొత్తూరు చౌడేశ్వరి ఆలయ నిర్వాహకులు చేపట్టనున్నారు.

హైకోర్టు ఆదేశాలు బేఖాతారు



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి తన సమస్యను తెలుపుతున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రామచంద్ర

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొన్ని పంచాయతీలలో గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లను సరైన కారణాలు లేకుండానే తొలిగించిన నేపథ్యంలో పెద్దకాంపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ రామచంద్ర యాదవ్ హైకోర్టు దృష్టికి తనకు జరిగిన అన్యాయాన్ని తీసుకువెళ్లారు. సరైన కారణాలు లేకుండా తొలగించినందున సంబంధిత కేసులో తనను తిరిగి విధులు నిర్వహించే విధంగా ఆదేశాలు జారీ చేసారని, ఈ విషయమై ఉపాధి ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను కలిసి కోర్టు ఉత్తర్వులను చూపించి విధుల్లో చేర్చుకోవలసిందిగా అభ్యర్థించినప్పటికి పట్టించుకోవడంలేదని ఆవేదనతో తెలిపారు. రెండు రోజుల క్రితం కడప పార్లమెంట్ సభ్యుడు అవినాష్‌రెడ్డితో కలసి జిల్లా కలెక్టర్ శ్రీధర్‌ను కలసి విధుల్లోకి చేర్చుకోవలసిందిగా విజ్ఞప్తి చేసానని, అయినప్పటికీ అధికారులు విధుల్లోకి తీసుకోవడం లేదని, అధికారులు స్పందించాలని తన ఆవేదనలో తెలిపారు.

పొలాల్లో ప్రమాదపు అంచున కరెంటు తీగలు



చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు

చింతకొమ్మదిన్నె : పొలాల్లో 11 కేవీ విద్యుత్ వైర్లు సాగి వేలాడుతుండటంతో రైతులు సేద్యాలు చేసుకోవాలన్నా భయపడుతున్నారు. స్తంభాలను 50 మీటర్ల వ్యత్యాసంతో పొలాల్లో నాటడంతో ప్రస్తుతం ఆ విద్యుత్ తీగలు సాగి కొన్ని చోట్ల చేతులకు అందే ఎత్తులో వుంటున్నాయి. దీంతో రైతులకు సేద్యాలు చేయించుకోవాలన్నా, కాస్తా ఏపుగా పెరిగే పైర్లు వేసుకోవాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వేసవి కావడంతో పొలాలు ఎక్కువగా బీడుగా ఉంటాయి కాబట్టి కాస్తా దృష్టి పెడితే ఇలాంటి సమస్యలు పరిష్కరించడానికి సులువుగా ఉంటుంది.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆ ధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్ ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18-28 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండి టెన్త్, ఇంటర్, డిప్లమో, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులని ఆయన పేర్కొన్నారు.

కొత్త రేషన్ కార్డులకు అనేక చిక్కులు

- అనేక నిబంధనలతో కార్డుదారులకు అవస్థలు
- మార్పులు, చేర్పులకు సర్వర్ సతాయింపు
- సర్వర్ పనిచేయక కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ

సింహాద్రిపురం : కొత్త రేషన్ కార్డుల కోసం కూటమి సర్కార్ విధించిన అనేక నిబంధనలు పేద, మధ్య తరగతి కుటుంబాలకు గుదిబండగా మారాయి. లబ్ధిదారులకు మొన్నటి వరకు వివాహ ధృవీకరణ పత్రం తప్పనిసరి చేశారు. దానిపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తం కావడంతో సర్కార్ దిగి వచ్చింది. వివాహక రిజిస్ట్రేషన్ ధృవపత్రం లేకున్నా రేషన్ కార్డు కోసం అవకాశం కల్పించింది. దీంతో పేదలపై పెను భారం తగ్గింది. అయితే అనేక ఆంక్షలతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల వ్యాప్తంగా 32 రేషన్ షాపులు ఉన్నాయి. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా మొత్తం 8,900 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా బియ్యం సరఫరా అవుతోంది. పులివెందుల రేషన్ గోడౌన్ ఆర్ఐని సంప్రదించగా ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు. కొత్తగా రేషన్ కార్డులో మార్పులు, చేర్పుల కోసం



సచివాలయంలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకుంటున్న లబ్ధిదారులు

కార్డు 454 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. పాత రేషన్ కార్డులో కొత్త పేర్ల నమోదు, తొలగింపు, అడ్రస్ మార్పు తదితర వాటి కోసం మరికొంతమంది దరఖాస్తులు చేసుకున్నారు.

హౌస్ మ్యాపింగ్‌తో లబ్ధిదారుల ఇబ్బందులు

రేషన్ కార్డు కోసం కోసం వివాహమై పిల్లలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలంటే భార్యభర్తలు, పిల్లలు ఒకేచోట హౌస్ మ్యాపింగ్‌లో ఉండాలి. తల్లిదండ్రులది ఒక చోట, పిల్లలది మరోచోట ఉంటే దరఖాస్తు స్వీకరణ సమయంలో ఎర్రర్ అని చూపుతోంది. ఇలాంటి సమస్యలతో చాలా మంది కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపకపోతే కొత్త కార్డులు మంజూరయ్యే అవకాశం లేదు.

పది నిమిషాల్లోనే ఇచ్చేవారు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ/వార్డు సచివాలయాల్లోనే వివాహ ధృవీకరణ పత్రాలు పది నిమిషాల్లో ఇచ్చేవారు. ఈ-సైన్ విధానం లేకపోవడంతో ప్రజలు సులభంగా సర్టిఫికెట్ పొందే అవకాశం ఉండేది. తాజాగా కూటమి ప్రభుత్వ ఆంక్షలతో పేదలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

అర్హులందరికీ రేషన్ కార్డులు

కొత్త రేషన్ కార్డుల కోసం ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అర్హతలు ఉన్నవారందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరవుతాయి.

– నాగేశ్వరరావు, తహసీల్దార్, సింహాద్రిపురం

పలు కార్యక్రమాలలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



విద్యానందరెడ్డి అన్న కుమారుడి వివాహ వేడుకలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు



వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నాగేష్ నూతన గృహ ప్రవేశ వేడుకలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : శనివారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పట్టణంలో పలు కార్యక్రమాలలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. శనివారం ఆయన ఇటీవల నూతన గృహప్రవేశం చేసిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, బంగారు వ్యాపారి నాగేష్ ఇంటికి వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించి యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీకి చెందిన ఆర్యవైశ్య నాయకుడు రజిని కుమార్తె వెన్నెల వివాహం నిఖిల్‌తో ఇటీవల జరిగింది. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే లింగాల మండలం వైఎస్సార్‌సీపీ నాయకుడు విద్యానందరెడ్డి అన్న కొడుకు జయదీప్, వెంకటశ్వేతల వివాహం రంగనాథస్వామి ఆలయంలో జరిగింది. ఈ వివాహానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఇటీవల వివాహమైన మిట్టమల్లేశ్వరస్వామి ఇంగ్లీష్ మీడియం స్కూలు కరస్పాండెంట్ రవికుమార్ కుమారుడు పవన్‌సాయికిశోర్, లయ మాధురిలను వారి ఇంటికి వెళ్లి అవినాష్‌రెడ్డి ఆశీర్వదించారు. అలాగే వైఎస్సార్‌సీపీ ఎస్టీ నాయకులు జుట్టు గంగన్న కుమారుడు బాబు కుమార్తె మానస, మహేష్‌ల వివాహ వేడుకలో పాల్గొని కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు మిట్టా కరుణాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల ఆకస్మిక తనిఖీ

లింగాల : మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులను ఏపీఓ గంగరాజు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఉపాధి హామీ పనులలో అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు రావడంతో తనిఖీలను చేపట్టారు. మస్టర్లు, పనులకు వెళ్లిన కూలీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఫీల్డ్ అసిస్టెంట్‌కు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. సరైన కొలతలతో పనులు నిర్వహించకపోతే, వేతనాలు తగ్గుతాయన్నారు. అదేవిధంగా కేవలం హాజరు కానీ వారిని గుర్తించి వారికి హాజరు కూడా నిలిపివేయడం జరుగుతుందని సూచించారు. తగిన జాగ్రత్తలతో పనులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులను తనిఖీ చేస్తున్న ఏపీఓ గంగరాజు

నేడు ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ఉదయం ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. షుగర్ సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మహిళలకు ఉద్యోగ అవకాశాలు

వేంపల్లె : ఆదిత్య బిర్లా గార్మెంట్స్ లిమిటెడ్ పులివెందులలోని ఆదిత్య బిర్లా గార్మెంట్స్‌లో మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు కో ఆర్డినేటర్ చంద్రబాబు తెలిపారు. ఉపాధి కల్పన-జిల్లా గ్రామాణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉపాధి కల్పించేందుకు వేంపల్లెలోని వెలుగు కార్యాలయంలో సోమవారం మహిళలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్ల తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రైనీ టైలర్‌గా ఉపాధి పొందేందుకు 7వ తరగతి పాసై ఉండాలని, 18 ఏళ్ల నుంచి 23 ఏళ్లు ఉన్న మహిళలు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. నెలకు రూ.9181 జీతంతోపాటు నెలవారీ హాజరు బోనస్ 1000 వస్తుందన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ సౌకర్యంతోపాటు బస్సు సౌకర్యం కూడా ఉంటుందన్నారు. జనరల్ షిఫ్ట్ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5.30 వరకు డ్యూటీ ఉంటుందన్నారు.

1వ తేదీ నుంచి షాపుల ద్వారా రేషన్ పంపిణీ

తొండూరు : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల ద్వారా రేషన్ బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని తహసీల్దార్ బి.రామచంద్రుడు తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్ఓలు, రేషన్ డీలర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు తెరిచి ఉంచాలని తెలిపారు. వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపిస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీలర్లు సక్రమంగా రేషన్‌ను పంపిణీ చేయాలి

వేంపల్లె : డీలర్లు సక్రమంగా రేషన్‌ను పంపిణీ చేయాలని మండల తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన డీలర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎండీయూ ఆపరేటర్ల ద్వారా పంపిణీని ప్రభుత్వం రద్దు చేయడంతో డీలర్ల వద్ద నుంచే ప్రజలు రేషన్‌ను తీసుకెళ్లాలన్నారు. డీలర్లు కూడా ప్రజలకు ఇబ్బందులు లేకుండా రేషన్‌ను పంపిణీ చేయాలన్నారు. వికలాంగులకు, 80 ఏళ్ల దాటిన వృద్ధులకు ఇంటి వద్దనే వేలిముద్రలు వేయించుకుని రేషన్‌ను అందజేయాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్క డీలరు తమ షాపు వద్ద సూచిక పట్టికను తప్పనిసరిగా పెట్టాలన్నారు. స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ లోకేష్, డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ హరినాథరెడ్డి

వృద్ధులకు అన్నదానం

లింగాల : మండలంలోని ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో శనివారం లింగాలకు చెందిన అన్నవరం సుభద్రమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారులు రాజేశ్వరరెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యులు వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

యువకుడిని కఠినంగా శిక్షించాలి

పులివెందుల : మైలవరం మండలం ఎ.కంబాలదిన్నె గ్రామంలో నాలుగేళ్ల బాలికపై అత్యాచారం చేసి చంపిన యువకుడిని కఠినంగా శిక్షించాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన ప్రకటనలో తెలుపుతూ నాలుగేళ్ల బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు ఎక్కువయ్యాయని, ప్రభుత్వం ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వంలో దిశా చట్టం అమలులో ఉన్నందువల్ల మహిళలకు రక్షణ లభించేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దిశా చట్టాన్ని నిర్వీర్యం చేశారన్నారు. బాలికపై అత్యాచారం చేసి చంపడం అమానుష చర్య అన్నారు. పోలీసులు ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

పులివెందుల రూరల్ : మైలవరం మండలం ఎ.కంబాలదిన్నె గ్రామంలో ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన నాలుగేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన యువకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ సమన్వయకర్తలు నాగేశ్వరరావు, ఎస్.గంగన్న, ఎంఈఎఫ్ నాయకులు చరణ్‌కుమార్‌లు కోరారు. శనివారం పట్టణంలోని స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో వారు అర్బన్ సీఐ చాంద్ బాషాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని సీఎం చంద్రబాబుకు మెమోరాండం ఇవ్వడంతోపాటు బాధి కుటుంబానికి సంఘీభావంగా అర్బన్ సీఐకి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

రేపు క్రైస్తవ హక్కుల పరిరక్షణ సమావేశం

పులివెందుల టౌన్ : అలియన్స్ ఫర్ పాస్టర్స్ డెవలప్‌మెంట్(ఏపీడీ), క్రైస్తవ హక్కుల పరిరక్షణ దళం(సీఆర్పీఫోర్స్) సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం చెన్నారెడ్డి కాలనీలోని ప్రార్థన మందిరంలో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఏపీడీ అధ్యక్షుడు ఆర్.ప్రశాంత్ తెలిపారు. ప్రస్తుత సమాజంలో క్రైస్తవుల హక్కులను కాపాడటమే ఈ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఎవరి దైవాన్ని వారు ఆరాధించుకుందామని, ఇతర మతాలను గౌరవిద్దామని, పరమత దూషణలను ఆపుదామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త కోలాప్రసాద్ హాజరవుతారన్నారు.

సచివాలయానికి ఏఎన్ఎం ఒక్కరే దిక్కు



మూత పడిన గంగవరం సచివాలయం

కమలాపురం : మండలంలోని గంగవరం సచివాలయానికి ఏఎన్ఎం ఒక్కరే దిక్కయ్యారని గ్రామానికి చెందిన చిన్న అనే వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడారు. గంగవరం సచి వాలయానికి ఎప్పుడు తాళం వేస్తారో తెలియదన్నారు. వివిధ పనులపై వచ్చిన ప్రజలు వెనుదిరిపోతుంటారని ఆరోపించాడు. దాదాపు 7-8 మంది సిబ్బంది ఉండగా కేవలం ఒక్క ఏఎన్ఎం మాత్రమే ఉన్నారని, మిగిలిన వారంతా ఎక్కడని ఏఎన్ఎంను అడిగితే శెలవుపై వెళ్లారని ఏఎన్ఎం చెప్పారని అతడు ఆరోపించాడు. సెక్రటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్‌తో పాటు మిగిలిన సిబ్బంది అందరికి ఒకటే రోజు శెలవు ఇస్తారా? అని ఆయన ప్రశ్నించాడు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక పోవడంతోనే ఇలా జరుగుతోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయాలపై పట్ల దృష్టి సారించాలని ఆయన కోరారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



కొత్తపల్లెలో రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న బావి

పులివెందుల రూరల్ : ఎర్రబల్లె పంచాయతీ పరిధిలోని కొత్తపల్లె సమీపంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద రోడ్డుపక్కన ప్రమాదకరంగా బావి ఉంది. వాహనదారులు ప్రయాణించేటప్పుడు ఏమాత్రం అదిమరిస్తే అంతే సంగతులు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. బావి దగ్గర ఎటువంటి సూచిక బోర్డులు, ప్రహరీ గోడ లేకపోవడంతో గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల్లో వెళ్ళేటప్పుడు వాహనాదారులు జాగ్రత్తగా వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న బావి దగ్గర సూచిక బోర్డు గానీ, ప్రహరీ గోడ కానీ ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైశాఖమాసం చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూజారి మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుండి పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పెనుశిల లక్ష్మీనరసింహస్వామి (పెంచలకోన క్షేత్రం) ఆలయం వరకు జూన్ 15 నుండి 20వ తేదీ లోపు స్వామివారి మహాపాదయాత్ర ఉంటుందని, 11, 9 రోజులు దీక్ష తీసుకునే భక్తులు ఆలయం వద్దకు వచ్చి స్వీకరించవలసిందిగా కోరారు. మహాపాదయాత్రలో పాల్గొనదలచిన భక్తులు ముందుగా ఆలయ నిర్వాహకులకు తెలియజేయాలని కోరారు.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

కథలు జీవిత వాస్తవాలను స్ఫురింపజేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : కథలు జీవిత వాస్తవాలను స్ఫురింపజేయాలని, పిల్లల కథా రచనలలో సృజనాత్మకతను పెంచే కార్యక్రమమే కథా వసంతమని కథా రచయిత డాక్టర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో శనివారం రెండు రోజుల పాటు నిర్వహించే కథా వసంతం 2కే25 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ కథల్లో సాహసకథలు, జంతువుల నీతి కథలు, విద్యాబోధన కథలుగా విభజించి ఉంటాయన్నారు.

కథల ద్వారా ఊహాశక్తి పెరుగుతుందన్నారు. ఇది విద్యార్థులకు కీలకమైనదని, సైన్స్ ఆవిష్కరణలన్నీ ఊహ చేసిన తర్వాత నిరూపించబడినవని తెలిపారు. ఏ ఒక్క మనిషి ఒంటరిగా బతకలేడని, కుటుంబం, సమాజం తోడుగా ఉంటుందన్నారు. మన చుట్టూ ఉన్న వారితో, ప్రకృతిలో ఉన్న జంతువులతోనూ, ప్రాణకోటితో ఏర్పడినవే మానవ సంబంధాలని, కథల్లో మానవ సంబంధాలు, వ్యక్తులు, సంభాషణలు కీలకమైనవని అన్నారు. కథా రచయిత దాదా హయత్ మాట్లాడుతూ పర్యావరణం అంశాలను కథల్లో జోడించడం ద్వారా ప్రజలందరికి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చునని తెలిపారు. పర్యావరణంపై కథలు ఈ మధ్యకాలంలో తక్కువగా వస్తున్నాయన్నారు. దీనిపై మరింత కృషి జరగాల్సి ఉందన్నారు. ప్రముఖ కథా రచయిత కావూరి మారుతి విద్యార్థుల్లో దాగి ఉన్న కథా నైపుణ్యాలను వెలికి తీయాలని తెలిపారు. కథలు ఎలా రాయాలో వివరించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను పెంచేందుకు కథా వసంతం ఉపయోగపడుతుందన్నారు. కథా వర్క్ షాప్ ద్వారా విద్యార్థులు రాసే కథలతో పుస్తకాన్ని తీసుకురాబోతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు సునీత, మురళీగుప్త, మురుకూటి సూర్యానారాయణరెడ్డి, రాజేష్, శిరీష, వేంపల్లి రాజశేఖర్, మీనా తదితరులు పాల్గొన్నారు.

నాన్ బీటీ విత్తనాల సాగు చేయకూడదు

ఖాజీపేట : నాన్ బీటీ విత్తనాలు సాగు చేసేటప్పుడు రైతులు అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం ఏరువాక శాస్త్రవేత్త డా వీరయ్య, డా.పి.శ్రీవల్లి రైతులకు సూచించారు. ఖాజీపేట మండలం తవ్వారిపల్లె గ్రామంలో నాన్ బీటీ విత్తనాలను జంపన అమరేశ్వర్‌రెడ్డి అనే రైతు సాగు చేశాడు. అయితే పంట సక్రమంగా దిగుబడి రాకపోవడంతో వెంటనే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పంట పొలాన్ని వ్యవసాయ అధికారుల బృందం పరిశీలించారు. సాగు విధానంతో పాటు సాగు చేసిన విత్తన సంచులను తెప్పించుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాన్ బీటీ విత్తనాలు మన వాతావరణానికి అనువైనవి కావన్నారు. అలాంటి విత్తనాలు రైతులు సాగు చేసేటప్పుడు అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలని చెప్పారు. ఇలాంటి విత్తనాలు ఎవరైనా విక్రయిస్తే రైతులకు వెంటనే సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని రైతులకు సూచించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నాగార్జున తోపాటు స్థానిక వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

కడప కోటిరెడ్డి సర్కిల్ : గర్భిణులకు, చంటి బిడ్డలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని షిఫ్ట్ ఎడ్యుకేటర్ ప్రసన్న లత సూచించారు. శనివారం కడప నగరంలోని పాలెం పాపయ్య వీధి అంగన్‌వాడీ కేంద్రంలో ఇమ్యూనైజేషన్ సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వ్యాధి నిరోధక టీకాలు వేయించడం వలన వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చున్నారు. కార్యక్రమంలో ట్రైనీ డాక్టర్లు హరిప్రసాద్, వర్షిత, సింహా, హెల్త్ సూపర్‌వైజర్లు రామాంజనమ్మ, సుబ్బరాయుడు, ఆరోగ్య కార్యకర్త లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు



గుంతలమయంగా మారిన గ్రామీణ రహదారులు

పులివెందుల రూరల్ : మండలంలోని కనంపల్లె గ్రామం నుంచి మోట్నూతలపల్లెకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. గ్రామానికి వాహనాలలో వెళ్లాలంటే రోడ్డంతా గుంతలమయంగా ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులపై భారీ వాహనాలు రావడంతో రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతింటున్నాయి. రాత్రి సమయాలలో ద్విచక్ర వాహనాలలో వెళ్లేటప్పుడు గుంతలు కనపడక కింద పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ రహదారులలో నిత్యం ప్రమాదాలు జరిగి ప్రజలు ఆసుపత్రి పాలవుతున్నారు. అధికంగా మట్టి లారీలు తిరుగుతుండటంతోనే రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతింటున్నాయని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు. ఈ విషయాన్ని అనేకమార్లు సంబంధిత అధికారులకు చెప్పినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులకు మరమ్మతులు చేపట్టాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.